క్లుప్తంగా

బొమ్మల కొలువు ప్రదర్శన అభినందనీయం



బొమ్మలకొలువును తిలకిస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

కొత్తపేట: భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల మేళవింపు అయిన బొమ్మల కొలువు ప్రదర్శన అభినందనీయమని అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధర రావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా పియదర్శినీ బాలవిహార్‌లో కరస్పాండెంట్ అద్దంకి బుద్ధచంద్రదేవ్ ఆధ్వర్యంలో మెగా బొమ్మల కొలువు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. విశేషంగా అలంకరిస్తున్న బొమ్మల కొలువును శనివారం డేవిడ్‌రాజు, గంగాధరరావు, రమాదేవి, ముసునూరి సందర్శించారు. బుద్ధచంద్రదేవ్‌ను, కుటుంబ సభ్యులను అభినందించారు. మండల వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ



మైక్ సెట్ అందించిన దాతలు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం గ్రామంలో వేంచేసిన బలుసులమ్మ, కనకదుర్గమ్మ, నూకాలమ్మ ఆలయ సముదాయానికి దాతలు మైక్ సెట్ బహూకరించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు అందించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు మేడిచర్ల చాణక్య, దండిపట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పక్కా సీసీ రోడ్లు



మామిడికుదురులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మామిడికుదురు: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మామిడికుదురులో రూ.29 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణంతో పాటు అదనపు వాటర్ ట్యాంకు నిర్మించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీలు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పీవీ ఆర్‌కె రాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మినీ గోకులాలు ప్రారంభం



నవాబుపేటలో మినీ గోకులాలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పథకం కింద మంజూరైన నిధులతో నిర్మించిన మినీ గోకులాల షెడ్లు ప్రారంభమయ్యాయి. మండలంలోని నవాబుపేటలో ఎంపీడీఓ ఎ.రాజు శనివారం ప్రారంభించారు. రైతులకు అమిత ప్రయోజనం కలిగే ఈ మినీ గోకులాలను తొలివిడత 48 మంది పాడి రైతులకు అందజేశామని ఎంపీడీఓ తెలిపారు. అలాగే ఫిబ్రవరిలో రెండో విడత మినీ గోకులాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏపీఓ జి.అరుణకుమారి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మలపల్లి యుక్త నాగశ్రీ ఆమె కుటుంబ సభ్యులు శనివారం రూ.10116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

మలికిపురం: మండలంలోని అడవిపాలెం వంతెన పై నుంచి శంకరగుప్తం డ్రైన్‌లో పడి గూడపల్లి గ్రామానికి చెందిన యువకుడు లక్కురాజ్ కుమార్(25) యువకుడు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి వంతెన నుంచి దూకేయడంతో శనివారం మృతదేహం లభ్యం అయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ శనివారం తెలిపారు.

ప్రమాదాల జంక్షన్

- జొన్నాడలో ఫ్లైఓవర్ పనులు అస్తవ్యస్తం
- ప్రయాణికులకు కనీస వసతుల కరువు
- పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని జొన్నాడ నాలుగు రోడ్ల జంక్షన్ అస్తవ్యస్తంగా తయారైంది. ఫ్లైఓవర్ పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్మాణ సామగ్రి గందరగోళంగా ఉంది. దీనికి తోడు ఇరువైపులా రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో గోతులు కూడా ఏర్పడ్డాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. దీనిపై పలుమార్లు నేషనల్ హైవే అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. మండపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాలకు ప్రధాన రహదారిగా భావిస్తున్న ఈ హైవేపై ప్రతి రోజూ వందలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఫ్లైఓవర్ పనులు పేరిట గతంలో ఉన్న బస్ షెల్టర్లను తొలగించడంతో బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు పడవలసి వస్తుంది. బస్సులను ఆపేందుకు నిర్దిష్టమైన ప్రదేశం లేక ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ ఆపడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఆందోళన పడుతున్నారు. మహిళలు, వృద్ధులకు జొన్నాడ మీదుగా ప్రయాణమంటేనే హడలెత్తిపోతున్నారు.



జొన్నాడ జంక్షన్‌లో గోతులమయంగా మారిన జాతీయ రహదారి

ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం

జొన్నాడ జంక్షన్‌లో ఫ్లైఓవర్ పనులు నిలిచిపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితుల్లో ప్రమాదాల నివారణకు హైవే అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. రహదారులు తీవ్రంగా దెబ్బతినడంతో వాహనదారులు ప్రయాణించే సమయంలో దుమ్ము, ధూళి కంట్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అలాగే రాత్రి వేళల్లో హైవే రోడ్డు నుంచి కాకినాడ రోడ్డుకు వెళ్లే మార్గంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. స్థానిక ఏటిగట్టు జంక్షన్ నుంచి జొన్నాడ ఆంజనేయస్వామి ఆలయం వరకూ సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర సర్వీస్ ఏర్పాటు చేస్తే ప్రమాదాల తీవ్రత పూర్తిగా తగ్గే అవకాశం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వాహనదారుల నుంచి వ్యక్తమవుతోంది. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి ఫ్లైఓవర్ పనులతో సంబంధం లేకుండా నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జొన్నాడ జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేక రోడ్డుపైనే నిలబడుతున్న ప్రయాణికులు

ఇరువైపులా సీసీ రోడ్డు వేయాలి

జొన్నాడ జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మిస్తున్న కిలోమీటరు పరిధిలో ఇరువైపులా దెబ్బతిన్న రోడ్డు స్థానంలో సీసీ రోడ్డును వేస్తే ప్రమాదాలను నివారించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అలాగే ఫ్లైఓవర్‌కు ఇరువైపులా వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీని ఏర్పాటు చేసిన పరిధిలోని రోడ్డు గోతులను సత్వరమే పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. ఇకనైనా ఫ్లైఓవర్ కాంట్రాక్టర్, హైవే అధికారులు సమన్వయంతో పనిచేసి జొన్నాడ జంక్షన్‌లో ప్రమాదాలను నివారించి ప్రజల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

ప్రభల తీర్థాలను ప్రశాంతంగా చేసుకోవాలి

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా ఏటా కనుమ రోజున అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ప్రభల తీర్థాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా చేసుకోవాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అన్నారు. అంబాజీపేట పెద్దవీధిలోని ఏవీఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన జగన్నతోట ప్రభల ఉత్సవ కమిటీల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రభల తీర్థంలో అల్లర్లకు పాల్పడి భక్తులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రద్దీగా ఉండే సెంటర్లలో పోలీస్ పికెట్‌లు పెడుతున్నామన్నారు. మొబైల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీజే బాక్స్‌లకు అనుమతి లేదన్నారు. ప్రభల తీర్థంలో రెండు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రభల నిర్వాహకులు, ప్రజలు సహకరించాలన్నారు. కోడి పందాలు, గుండాటలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. అనంతరం జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థం ప్రాంతాన్ని డీఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎస్సై కె.చిరంజీవి, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేట సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

తెప్పోత్సవానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరుకల్యాణ మహోత్సవాల్లో చివరి రోజు ఏటా అంతర్వేది చెరువులో నిర్వహించే తెప్పోత్సవానికి ఈ దఫా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన అంతర్వేదిలో మాట్లాడుతూ, అంతర్వేది చెరువు జల్‌జీవన్ మిషన్‌లో తాగునీటి ప్రాజెక్ట్ పనులు చురుగ్గా జరుగుతున్న తరుణంలో ఆలయంకు ఉత్తరం వైపున తెప్పోత్సవానికి ప్రత్యామ్నాయ చెరువు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాగా ఆలయానికి తూర్పువైపున దాతల సాయంతో సుమారు వెయ్యి మందికి సరిపడా అన్నప్రసాద భవనం నిర్మాణంలో ఉందన్నారు. ఈ భవనం పూర్తయితే భక్తుల భోజన వసతికి మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆలయ ప్రాంగణంలో రూ.4 లక్షలతో స్టీల్ రాడ్ల క్యూ లైను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పౌర్ణమి రోజున స్వామివారు సముద్ర స్నానం అనంతరం సేదతీరే నూతన వసంత మండపం చుట్టూ రూ.4 లక్షలతో చప్టా, రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టనున్నట్టు ఏసీ సత్యనారాయణ తెలిపారు.



అంతర్వేది ఆలయానికి తూర్పువైపున నిర్మాణంలో ఉన్న అన్నప్రసాద భవనం

క్రీడాకారుడు కాశ్యప్‌కు అభినందనల వెల్లువ

ఆలమూరు: జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ఆలమూరు మండలంలోని జొన్నాడకు చెందిన పెద్దింటి నరసింహ కాశ్యప్‌ను గ్రామస్తుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఇటీవల మంగళగిరిలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 17 పోటీల్లో జట్టు కెప్టెన్‌గా కాశ్యప్ పాల్గొన్నారు. అక్కడ జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరచడంతో అతనిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ మేరకు గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు శనివారం ఆ క్రీడాకారుడు కాశ్యప్‌ను ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, టీఎం ఆదిత్య రెడ్డి, నల్లమిల్లి జ్యోతిరెడ్డి, టి.శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



జొన్నాడలో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన కాశ్యప్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఇసుకరీచ్‌లో అక్రమ వసూళ్లపై కన్నెర్ర

మామిడికుదురు: పెదపట్నంలంక ఇసుక రీచ్‌లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ బీజేపీ నేతలు శనివారం నిరసన తెలిపారు. రీచ్‌ను సందర్శించిన బీజేపీ నేతలు వేగి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, యేడిద బాబులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒక్కో ట్రిప్పునకు రూ.300 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంత వరకు అయిదు వేల ట్రిప్పులు ఇసుక తీశారన్నారు. అదనం ఎందుకు వసూళ్లు చేస్తున్నారని ప్రశ్నిస్తుంటే అధికారులు, ప్రజా ప్రతినిధుల కోసమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఇసుక ఉచితమని ప్రభుత్వం చెబుతున్నా దాన్ని కొంత మంది నేతలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై అధికారుల తీరు కూడా అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు.



పెదపట్నంలంకలో ఇసుక అక్రమ వసూళ్లపై బీజేపీ నేతల నిరసన

కోడి పందాలు, గుండాట ఆడితే చట్టపరమైన చర్యలు

అయినవిల్లి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని కోడి పందాలు, గుండాట నిర్వహించడానికి ఎటువంటి పర్మిషన్లు లేవని అలా నిర్వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామని తహసీల్దార్ నాగలక్ష్మమ్మ, ఎస్సై మనోహర్‌జోషి హెచ్చరించారు. శనివారం మండలంలోని సిరిపల్లి, తొత్తరమూడి అగ్రహారం రోడ్డులోని కోడి పందాలు ఆడడానికి ఏర్పాట్లు చేస్తున్న ప్రదేశాలను వారు సందర్శించారు. అక్కడ స్థానికులను పిలిచి కోడిపందాలు, గుండాట ఆడితే తమకు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సిరిపల్లి, తొత్తరమూడి తదితర గ్రామాల్లో కోడిపందాలు, గుండాట ఆడితే చట్టరీత్యా చర్యలు చేపడతామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీరి వెంట ఆర్ఐ రాయుడు, వీఆర్వోలు ఉన్నారు.



సిరిపల్లిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్, ఎస్సై తదితరులు

విగ్రహం ఏర్పాటుకు పూర్వ విద్యార్థుల నిర్ణయం

పి.గన్నవరం: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పి.గన్నవరం ఉన్నత పాఠశాల అభివృద్ధికి పాటుబడిన దివంగత మంత్రిప్రగడ వెంకట సుబ్బారావు విగ్రహాన్ని పాఠశాల ఆవరణలో నెలకొల్పాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఆయన వద్ద చదివిన పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాల వద్ద సమావేశం అయ్యారు. 1972లో స్థానిక యూపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయించేందుకు విశేష కృషి చేశారన్నారు. సుబ్బరాజు విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు వారు తెలిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన విశ్రాంత ఉపాధ్యాయుడు కేవీ శాస్త్రిని సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ రక్షణ దళం కమాండెంట్ కొండా నర్సింహారావు, కోట రామ్మోహన్‌రావు, యర్రంశెట్టి సూర్యనారాయణ మూర్తి, అడ్డాల రామకృష్ణ, యర్రంశెట్టి ఆదినారాయణ, నల్లా పెదకాపు, బొరుసు చంద్రశేఖర్, డొక్కా భీముడు, పమ్మి అర్జునరావు, హెచ్ఎం డీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయుడు కేవీ శాస్త్రిని సత్కరిస్తున్న కేఎన్ రావు, పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ జూనియర్ కాలేజీ 1989–91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 35 ఏళ్ల తర్వాత వారంతా ఒకచోట కలుసుకున్నారు.

కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ ముప్పర్తి వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. నాడు పాఠాలు బోధించిన అధ్యాపకులను వారు సన్మానించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభం

సఖినేటిపల్లి: మోరిపోడు రివర్‌సైడ్ స్కూల్‌లో కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్‌ను శనివారం కలెక్టర్ మహేష్ కుమార్ ప్రారంభించారు. అంతకుముందు స్కూల్ వద్ద కలెక్టర్‌కు, స్కూల్ ఫౌండర్, ప్రొఫెసర్ డార్విన్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలోని సుబ్బమ్మ మిషన్ హాస్పిటల్‌ను కలెక్టర్ సందర్శించారు.

హాస్పిటల్‌లో వివిధ బ్లాక్‌లను, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, పేషెంట్ వార్డులను కలెక్టర్ చూశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డాక్టర్ లత పాల్, కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ, సేవ చేస్తున్న విధానానికి తమ వైపు నుంచి కూడా మద్దతు ఉంటుందన్నారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డీటీ సీహెచ్ భాస్కర్, ఆర్ఐ రామరాజు, వీఆర్వోలు దుర్గ, రమ్య, స్కూల్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



మోరిపోడు రివర్ సైడ్ స్కూల్‌లో కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

రాజోలు: సంక్రాంతికి స్వాగతం పలుకుతూ బి.సావరం గ్రామంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు శనివారం ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక శ్రీదేవి మూకాంబికా టౌన్‌షిప్ గ్రౌండ్స్‌లో లేఅవుట్‌లో 60 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు బండారు బాబు ఆధ్వర్యంలో పోటీల్లో మొదటి నలుగురు విజేతలకు గ్రైండర్, మిక్సీ, కుక్కర్లు, ఫ్యాన్లు అందజేశారు. బి.సావరం సర్పంచ్ కడియం రమాదేవి, మాజీ సర్పంచ్ కుంపట్ల మంజులాదేవి, ఉపాధ్యాయురాలు కోరుకొండ సుజాత, ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షుడు కాసు భవానీ, న్యాయవాది జి.రజితలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.23,116 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కొత్తపేట మండలం ఏనుగుమహల్‌కి చెందిన వానరాసి భార్గవ్‌రామ్ (5) పుట్టుకతోనే కుడివైపున ఉండవలసిన అవయవాలు ఎడమవైపు, ఎడమవైపు ఉండాల్సిన అవయవాలు కుడివైపు ఉన్నాయి. ఈ కారణంతో వయస్సు పెరిగే కొలది ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. బాలుడి గుండెకి హోల్ ఉంది. ఆపరేషన్ చేయాల్సి ఉంది. దానికి అధిక మొత్తంలో ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. కూలి పని చేసుకునే బాబు తండ్రికి అంత ఆర్థికస్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో సభ్యుల చేతుల మీదుగా బాబు ఇంటికి వెళ్లి రూ.23,116 చెక్కు అందజేశారు.



బాలుడి తండ్రికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

గ్రామాభివృద్ధే లక్ష్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని సర్పంచి పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు) తెలిపారు. కనుమనాడు నిర్వహించే ప్రభల తీర్థ మహోత్సవానికి రహదారుల నిర్మాణంతో పాటు పారిశుధ్య పనులు చేయించి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి బాటలో పయనించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయనతో పాటు ఉప సర్పంచి దిగుమర్తి చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఆత్రేయపురానికి చెందిన పెనుమళ్ల సత్యప్రసాద్‌ని 5 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్లు సీఐ కె.కాత్యాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. పి.గన్నవరం మండలం పోతవరం శివారు మురుగుకాల్వ వద్ద 250 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు కె.అన్నవరం, ఎం.రామచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

మామిడికుదురు: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని నగరం గ్రామంలో శనివారం జరిగిన అఖిల పక్ష సమావేశం డిమాండ్ చేసింది. కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ హోంమంత్రిగా ఉన్న అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడటం దారుణమన్నారు. ప్రపంచ దేశాల మన్ననలు అందుకున్న నేత అంబేడ్కర్ అని ఆయన గుర్తు చేశారు. అటువంటి మహనీయుడిని అవమానించిన అమిత్ షా తక్షణం తన పదవికి రాజీనామా సమర్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రంగనాయకస్వామికి ధనుర్మాస పూజలు

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలోని రంగనాయకస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. అర్చకులు గోపాలం, సాయినాథ్‌ల ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు. స్వామిని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

రెక్కలు తెగిన స్వప్నం నవల ఆవిష్కరణ



రెక్కలు తెగిన స్వప్నం నవలను ఆవిష్కరిస్తున్న హైమవతి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం కవి, పద్మభూషణ్ బోయి భీమన్న సతీమణి, ప్రముఖ రచయిత్రి బోయి హైమవతి, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ రాసిన రెక్కలు తెగిన స్వప్నం నవలను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ప్రతాప్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చేస్తున్న సాహిత్య సేవలు ప్రశంసనీయమని అన్నారు. రెక్కలు తెగిన స్వప్నం నవల నేటి మధ్యతరగతి బతుకు చిత్రం అన్నారు. హైమవతిని ప్రతాప్ శాలువాతో సత్కరించారు. నల్ల విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కిరణ్ ప్రసాద్, గొల్ల లలిత, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

దిండి రిసార్ట్స్ పనుల పరిశీలన

మలికిపురం: మండలంలోని దిండి హరిత రిసార్ట్స్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శనివారం పరిశీలించారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. వెంట ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల కళావేదిక ప్రారంభోత్సవం

మలికిపురం: మండలంలోని రామరాజులంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 2000–2001 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సేకరించిన రూ.రెండు లక్షల విరాళాలతో నిర్మించిన కళావేదికను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే, పూర్వ విద్యార్థులను అభినందించారు. కూటమి నాయకులు, పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధికి గ్రాంట్ మంజూరు

సఖినేటిపల్లి: మండల కేంద్రంలో తొమ్మిది పేటలను కలుపుతూ ఉన్న రోడ్డు అభివృద్ధికి ఎంపీ గ్రాంటు నుంచి రూ.కోటి 35 లక్షలు మంజూరైనట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం తెలిపారు. సఖినేటిపల్లి కేఎస్‌ఎఫ్ రోడ్డు నుంచి సత్తిరేవుపుంత వరకూ 3.2 కిలోమీటర్ల రోడ్డు బీటీ పనులకు పై గ్రాంటు మంజూరైందన్నారు. గ్రాంటు ఇచ్చిన ఎంపీ హరీష్ మాథుర్‌కు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.